క్లుప్తంగా

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్ర పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలు సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవం ఉంటుందని వివరించారు. ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి చాలా అరుదుగా వందల సంవత్సరాలకు ఒకసారి ఇలా వస్తుందని పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ

మైదుకూరు : పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న 94 మంది బాలికలకు బుధవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు విద్యాసామాగ్రి అందజేశారు. మాక్ డ్రిల్ చేసేందుకు అవసరమైన ఒక బ్యాండ్ డ్రమ్మును కూడా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ, సంస్థ నిర్వాహకుడు రామకృష్ణారెడ్డి, రెజీనా, మహబూబ్‌బీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వండి

కాశినాయన : మండలంలోని పింఛన్‌దారులకు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలో 5,084 పింఛన్లకు గాను రూ.2.20 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఈ నగదును బుధవారం ఆయా గ్రామ పంచాయతీల సెక్రటరీలకు అందజేశామన్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి ఇంటింటికి పింఛన్ పంపిణీ చేయాలని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ


పోలమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, తదితరులు

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గంటాప్రహల్లాదరెడ్డి, సొసైటీ డైరెక్టర్ గంటా సుబ్బిరెడ్డి తల్లి గంటాపోలమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. బుధవారం ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ యోగానందరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు పోలమ్మ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డిస్కం ఈఈ బదిలీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ ఈఈ జి. శ్రీనివాసులురెడ్డిని నంద్యాలకు బదిలీ చేశారు. నంద్యాలలో పనిచేస్తున్న రమణారెడ్డిని ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. త్వరలో రమణారెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారు.

చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి


పోలీసులకు సూచనలిస్తున్న మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు

ఖాజీపేట : మండల పరిధిలో చోరీల నియంత్రణపై సిబ్బంది దృష్టి సారించాలని మైదుకూరు డీఎస్పీ టి. వెంకటేశులు సూచించారు. ఖాజీపేట స్టేషన్‌లో సిబ్బందితో ప్రత్యేకంగా సమావేమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల సౌకర్యాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత

వైవీయూ : విశ్వవిద్యాలయంలో చదువులు సాగించే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడటానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం విద్యార్థులు వారికి ఎదురవుతున్న సమస్యల గురించి చర్చించేందుకు విశ్వవిద్యాలయ వసతి గృహాల చీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి పరిపాలన భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమలాపురం నుంచి పెద్దపుత్త మీదుగా, అలానే చింతకొమ్మదిన్నె నుంచి విశ్వవిద్యాలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. వెనువెంటనే కడప డిపో మేనేజర్ కు రిజిస్ట్రార్ లెటర్ ద్వారా కోరారు. రాయలసీమ విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

● గలగలా రాజోలి


వెల్లాల వద్ద కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి రాజోలి ఆనకట్టకు నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం రాజోలి ఆనకట్ట నీటితో జలకళ లాడుతోంది. రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 4429 క్యూసెక్కులు, కేసీ ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, చాపాడు కాలువకు 50 క్యూసెక్కులు నీరు పోతోందని, అయితే కేసీ ప్రధాన, చాపాడు కాలువలకు నీరు అధికారికంగా విడుదల చేయలేదని కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. వస్తున్న నీటితో పత్తి, వరి పంటనైనా సాగు చేసుకుందామని రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. - రాజుపాళెం


రాజోలి ఆనకట్ట వద్ద నీరు


ఆనకట్ట నుంచి కుందూనదిలోకి ఉధృతంగా పోతున్న నీరు


కేసీ ప్రధాన కాలువలో పోతున్న నీరు

తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి

చాపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా జరిగిన పనులపై సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ రహమతుల్లయ్య సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద బుధవారం 2023–24 ఏడాది జరిగిన ఉపాధి హామీ పనులపై ఎస్ఆర్పీ, డీఆర్పీ, సామాజిక తనిఖీ బృందానికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గురువారం నుంచి సిబ్బంది గ్రామాలలో జరిగిన ఉపాధి పనులపై తనిఖీ చేపడతారన్నారు. ఉపాధి కూలీలు తనిఖీ సిబ్బందికి సహకరించాలని కోరారు. సామాజిక తనిఖీ సిబ్బందికి అవసరమైన పత్రాలు అందజేశారు.

నూర్ బాషా ముస్లిం మైనారిటీ సంఘం అధ్యక్షుడిగా బాషా

రాజుపాళెం : రాజుపాళెం మండల నూర్ బాషా ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం మండల యూత్ అధ్యక్షుడిగా గాదెగూడూరుకు చెందిన టక్కశిల బాషాను నియమించారు. ఈ మేరకు నూర్ బాషా ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాజీ నియామక పత్రాన్ని అందించినట్లు బాషా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ రాజుపాళెం మండలంలో సంఘం పురోభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను సంఘం మండల యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి బాబాఫక్రుద్దీన్

ప్రొద్దుటూరు క్రైం : గిరిజన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్ బాబాఫక్రుద్దీన్ తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని లింగాపురం ఎస్టీకాలనీలో బుధవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ నిర్ధారణ టెస్టులతో పాటు ఉచితంగా ఈసీజీ చేశారు. మెడికల్ క్యాంపునకు వచ్చిన వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. గిరిజన హక్కుల రక్షణ, అమలు, ముఖ్యమైన చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్ భార్గవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ, అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ శివచంద్రారెడ్డి, ఎస్ఐ కల్పన తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో క్రీడాకారుల సత్తా


సర్టిఫికెట్లు, పతకాలు, ట్రోఫీతో విద్యార్థులు

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి రెండో స్థానంలో నిలిచారు. నంద్యాలలో జూలై 27, 28 తేదీల్లో జంప్ రోప్ రాష్ట్రస్థాయి 5వ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మైదుకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా విభాగం వారిగా ఎంపికైన మైదుకూరు విద్యార్థులు 6 ఈవెంట్లలో పాల్గొన్నారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు వినోనియా రాణి, చంద్రావతి తెలిపారు. ఈవెంట్లలో వారు ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకొని రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ గోశెట్టి రామ్మోహన్, ఫిజికల్ డైరెక్టర్లు వినోనియా రాణి, చంద్రావతి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆవుల వెంకటరమణ, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో లిఫ్ట్ ప్రారంభం

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన లిఫ్ట్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ప్రారంభించారు. సమావేశాల సందర్భంగా మీటింగ్ హాల్‌కు వెళ్లేందుకు అందరూ ఇబ్బందులు పడుతున్నారని గతంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచించడంతో లిఫ్ట్ నిర్మాణానికి కౌన్సిల్ ఏర్పాట్లు చేసింది. రూ.27.30 లక్షలతో నిర్మించిన లిఫ్ట్‌ను ప్రస్తుతం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, కమిషనర్ రఘునాథరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ సాయికృష్ణ, ఏఈ ఉమామహేశ్వరి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతోనే ర్యాంప్‌ల తొలగింపు


పోడియం వద్ద బైఠాయించిన కౌన్సిలర్ లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదేశాలతోనే వైఎంఆర్ కాలనీలో ర్యాంప్‌లను తొలగించామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్ద ర్యాంప్‌లను ఎందుకు తొలగించారని, ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ సమాధానం ఇస్తూ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పట్టణమంతా ర్యాంప్‌లను తొలగించాలని ఆదేశించారని తెలిపారు. ఆ మేరకు తాము వైఎంఆర్ కాలనీలో ర్యాంప్‌లను తొలగించడానికి వెళ్లామన్నారు. ఆంధ్రకేసరి రోడ్డు, కొర్రపాడు రోడ్డులలో రోడ్ల విస్తరణకు అధికారులు మార్కింగ్ ఇస్తున్నారని, కౌన్సిల్‌లో ఈ విషయంపై చర్చించలేదని సభ్యులు అడిగారు. కౌన్సిల్‌లో చర్చించిన తర్వాత అధికారులు నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. పట్టణమంతా జరుగుతున్న ఈ వ్యవహారంపై కౌన్సిలర్లను ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేకుండా పట్టణమంతా ఆక్రమణలు జరగకుండా చూడాలని సభ్యులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రులు జగన్, వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోల తొలగింపుపై ఇప్పటి వరకు సమాధానం చెప్పలేదని మున్సిపల్ వైస్ చైర్మన్లు ప్రశ్నించారు. సమాధానం ఇవ్వకపోతే మా చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి చెట్టు కింద నుంచి పరిపాలన సాగిస్తారని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఫొటోల తొలగింపుపై ఏదైనా జీఓ ఉంటే చూపాలని కమిషనర్‌ను కోరారు. లిఫ్ట్ ప్రారంభోత్సవంలో కూడా కౌన్సిలర్లకు కాకుండా బయటి వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వడంపై కౌన్సిలర్లు మండిపడ్డారు.

బైఠాయించిన కౌన్సిలర్

శ్రీరాములపేటలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పోడియం వద్ద బైఠాయించారు. గతంలో ఎమ్మెల్యే వరద అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులకు చెప్పిన తర్వాత కొద్ది రోజులు పనులు ఆపేశారని లక్ష్మీదేవి తెలిపారు. మళ్లీ ఏవిధంగా పనులకు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే తనకు సమాధానం చెప్పాలని ఆమె కొద్ది సేపు బైఠాయించగా మున్సిపల్ వైస్ చైర్మన్లు వారించడంతో ఆమె లేచి యథావిధిగా తన సీట్‌లో కూర్చున్నారు.

ఏపీ పీజీ సెట్ రద్దు చేయాలి

వైవీయూ : ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేసి, విశ్వవిద్యాలయాలు సెట్లు నిర్వహించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం విశ్వవిద్యాలయంలో ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత పీజీ ప్రవేశ పరీక్షల వల్ల విద్యాసంవత్సరం సరైన సమయానికి ప్రారంభమై, నిర్ణీత కాలంలో ముగియడం లేదన్నారు. తద్వారా పీజీ స్థాయిలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ భారీగా తగ్గిపోతోందన్నారు. అదే విధంగా పీజీసెట్‌కు సంబంధించిన సమాచారం కూడా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరడం లేదన్నారు. యూజీ డిగ్రీకి సంబంధించిన పరీక్షా ఫలితాలను వివిధ విశ్వవిద్యాలయాలు విభిన్న సమయాలలో ప్రకటిస్తుంటాయని, దీనివలన సెట్‌కు సంబంధించిన కౌన్సిలింగ్ కూడా ఆలస్యం అవుతుందన్నారు.

కుందూ పరవళ్లు


ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

చాపాడు: ఇటీవల కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన వరదనీటితో ఏపీలోని శ్రీశైలం పూర్తిస్థాయిలో నిండింది. ఈ క్రమంలో శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయటంతో కుందూ నదిలో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. చాపాడు మండలంలో ప్రవహిస్తున్న వరద నీరు 7,250 క్యూసెక్కులతో ప్రవహిస్తోంది. రాజోలి ఆనకట్ట నుంచి వస్తున్న వరద నీరు రాజుపాళెం, ప్రొద్దుటూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల మీదుగా కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వద్ద పెన్నానదిలో కులుస్తుంది. కృష్ణ జలాలు వస్తుండటంతో మైదుకూరు నియోజకవర్గంలోని రైతులు సాగు కోసం సమాయాత్తమవుతున్నారు.

‘తల్లికి వందనం’ ప్రభుత్వ బడులకే ఇవ్వాలి

పోరుమామిళ్ల: ప్రభుత్వ బడులు మనుగడ సాగించాలంటే తల్లికి వందనం తదితర పథకాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తింపచేయాలని ఏపీటీఎఫ్ పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి కోరారు. బుధవారం ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. మధ్యంతర భృతి ఇచ్చి, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులరెడ్డి, రామభూపాల్ రెడ్డి, అన్వర్‌బాష, సుబ్బారెడ్డి, సుబ్బయ్య, సీతారామిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ వీసీతో ఏఎఫ్‌యూ వీసీ భేటీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కే. కృష్ణారెడ్డిని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ భేటీ అయ్యారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఏఎఫ్‌యూ వీసీ తొలిసారిగా సందర్శించారు. ఇరువురు వీసీలు కలిసి విశ్వవిద్యాలయాల అభివృద్ధి గురించి చర్చించారు. సమావేశంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి, ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టోకెన్ నంబర్లను పునః సమీక్షించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సబ్‌క్రిప్షన్, డీఏ అరియర్స్, పీఎఫ్ అడ్జస్ట్‌మెంట్‌లకు సంబంధించి డీడీఓల ద్వారా బిల్లు చేసిన టోకెన్ నంబర్లను ఒక సారి పునః సమీక్షించాలని ఎస్టీయూ నేతలు కోరారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలగంగి రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్ రెడ్డి తదితరులు ఈ విషయమై కడప డిప్యూటీ ట్రెజరర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

కలెక్టర్ కలిసిన ఏపీ హంస నాయకులు

కడప రూరల్ : జిల్లా నూతన కలెక్టర్ గా విచ్చేసిన శివ శంకర్‌ను ఏపీ హంస నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వారిలో ఏపీ హంస కడప జిల్లా ప్రెసిడెంట్ బి.రాజరత్నం, కార్యదర్శి చంద్రమౌళి, ట్రెజరర్ జయప్రకాష్, వైస్ ప్రెసిడెంట్లు జయకుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ కుమార్, రాజశేఖరాచారి, రాధిక ఉన్నారు.

కేరళ మృతులకు సంతాపం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్య, వైద్యంలో అగ్రగామి రాష్ట్రం గాను, పుష్కలమైన నీరు, పచ్చని పొలాలతో నిత్యం కళకళలాడే కేరళలోని వయనాడు జిల్లాలో అనూహ్య వరదల కారణంగా వందలాదిమంది మరణించడం బాధాకరమని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో కేరళలో ప్రకృతి వైపరీత్యాలు, వరదల వల్ల చనిపోయిన మృతులకు ఆర్‌సీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

నైపుణ్యాలు దేశాభివృద్ధికి దోహదం

బద్వేలు అర్బన్ : యువత నైపుణ్యాలను సాధించి దేశాభివృద్ధికి దోహదపడాలని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.వెంకటసాయి కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌ఫేర్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక వైపు చదువుకుంటూనే ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి జాబ్‌ఫేర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్‌ఫేర్‌లో 200 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరవ్వగా ఇంటర్వ్యూల ద్వారా 160 మందిని ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వినోద్‌కుమార్, కబీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘన సన్మానం


కృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న విద్యాశాఖాధికారులు

ప్రొద్దుటూరు : ప్రధానోపాధ్యాయుడు అండ్లూరు కృష్ణారెడ్డి సేవలు ప్రశంసనీయం ప్రొద్దుటూరు, కడప డిప్యూటీ డీఈఓలు కృష్ణప్ప, రాజగోపాల్‌రెడ్డి కొనియడారు. మండల పరిధిలోని గోపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న అండ్లూరు కృష్ణారెడ్డి బుధవారం పదవీవిరమణ చెందారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులోని శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో పదవీవిరమణ సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓలు మాట్లాడుతూ నిబంధతతో కృష్ణారెడ్డి విధులు నిర్వహించారని ప్రశంసించారు. ఏపీటీఎఫ్, ఫ్యాప్టో, జేఏసీ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. అనంతరం కృష్ణారెడ్డి, ఆయన సతీమణి ఇంద్రావతి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎ.రవిప్రకాష్, వీరపునాయునిపల్లె ఎంఈఓ జాఫర్‌సాదిక్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అల్లుకున్న నిర్లక్ష్యం

పట్టణంలోని అంజనేయనగర్‌లోని కొలిమివీధిలో విద్యుత్ స్తంభానికి చెట్ల కొమ్మలు, తీగలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. కరెంట్ సరఫరా అవుతున్న తీగలకు చెట్లతీగలు అల్లుకోవడంతో తరచూ షార్ట్‌సర్క్యూట్‌కు గురై సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఫీజులు ఎగిరిపోయి సమస్య ఉత్పన్నమవుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వైర్లకు చెట్ల తీగలు తగిలి విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగ మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - బద్వేలు అర్బన్


విద్యుత్ స్తంభానికి, తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు

వైభవంగా ఏకాదశి పూజలు


మదన గోపాలస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని మదన గోపాలస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా ఏకాదశి పూజలు నిర్వహించారు. తప్పెట్లు, మేళతాళాల మధ్య గ్రామంలో గ్రామ దేవతలకు టెంకాయలు కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మదన గోపాల స్వామి ఆలయంలో భక్తులు స్వాములకు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. రాత్రి అర్కటవేములు, పగిడాల, టంగుటూరు, తొండలదిన్నె గ్రామాల్లోని భజన సంఘం సభ్యులు ఆలయంలో భజన పాటలు పాడారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి మదనగోపాల స్వామి ఆలయం ఎదురుగా పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పెద్దలు, భక్తులు కోరారు.

మీ సేవలు చిరస్మరణీయం


పదవీ విరమణ చేసినవారిని సన్మానిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ లోసారి సుధాకర్

కడప అర్బన్ : దాదాపు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో పోలీసుశాఖకు అందించిన సేవలు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జూలై నెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ పాల్గొన్నారు. పదవీవిరమణ సన్మానం పొందిన పోలీసు అధికారులలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఏఎస్ఐ ఎం. కొండారెడ్డి, మైదుకూరు ఎస్ఐ సి.వి రమణ ఉన్నారు.

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనులశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. బుధవారం ఈ మేరకు వారు మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గంగాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీలో 7300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్నారు. థర్డ్ పార్టీ విధానం వల్ల కార్మికులు చాలా నష్టపోతున్నారని తెలియజేశారు. ఈ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.